ధాన్యం రైతు దైన్యం

డీఏఓతో మాట్లాడుతున్న రైతులు (ఫైల్)



▶▶ నేను టీడీపీ నాయకుడిని. గత ప్రభుత్వంలోనే మాలాంటి రైతులకు మేలు జరిగింది. ఈ ప్రభుత్వంలో రైతులు నిండా మునిగిపోతున్నారు. గతేడాది పుట్టి ధాన్యం రూ.24 వేలకు అమ్ముకుంటే.. ఇప్పుడు రూ.15,200లకు కూడా కొనే దిక్కులేదు. ధాన్యం అమ్ముకోవడానికి ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం దండగా అంటూ మండలంలోని పాటూరుకు చెందిన ఓ టీడీపీ నేత జిల్లా వ్యవసాయశాఖ అధికారిణిని నిలదీశారు.

▶▶ ఇటీవల సివిల్ సప్లయ్స్ ఎండీ డాక్టర్ మంజీర్ జిలానీ కోవూరు మండలంలోని పాటూరు, ఇనమడుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశంలో రైతులు తమకు ప్రస్తుతం ధరలు గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది దిగుబడులు తక్కువగా ఉన్నాయి. ధరలు చూస్తే గతేడాదికంటే మరింత దిగజారిపోయాయని చెప్పారు.



కోతకు సిద్ధంగా ఉన్న ధాన్యం

- అలంకారప్రాయంగా కొనుగోలు కేంద్రాలు
- రైతులకు నిబంధనలు, మిల్లర్లకు ప్రయోజనాలు
- గతేడాది పుట్టి ధాన్యం రూ.24 వేలు
- ప్రస్తుతం రూ.15 వేల కూడా దాటని పరిస్థితి

కోవూరు: జిల్లాలో ధాన్యం అమ్మకాల పరిస్థితి దైన్యంగా మారింది. గతేడాది కంటే ధాన్యానికి మార్కెట్లో డిమాండ్ ఉన్నప్పటికీ మిల్లర్లు సిండికేట్‌గా మారి ధరలను మరింత పాతాళానికి దిగజార్చుతున్నారు. ఈ ఏడాదిలో జిల్లాలో సుమారు 7.70 లక్షల ఎకరాల్లో వివిధ రకాల వరిసాగు చేశారు. అయితే వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడులు దారుణంగా పడిపోయాయి. ఇప్పటివరకు కేవలం 10 నుంచి 15 శాతం మాత్రమే వరి కోతలు జరిగాయి. ఈ నెల రెండో వారం నుంచి వరి కోతలు పూర్తిస్థాయిలో ఊపందుకుంటాయి.

పేరుకే కొనుగోలు కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా సుమారు 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా అధికార యంత్రాంగం చెబుతోంది. ఒక పక్క కలెక్టర్ ఆనంద్, మరో పక్క జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఏఓ సత్యవాణి కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కల్పిస్తామని చెబుతున్నారు. మిల్లర్లు, దళారులు ధరలు తగ్గిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ధాన్యం తేమశాతం చూడడానికి మాయిశ్చర్ మెషీన్లు కూడా చాలా చోట్ల ఇంకా అందుబాటులో లేవని, ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతానికి ఆరబెట్టుకోవాలన్నా కొనుగోలు కేంద్రాల్లో కళ్లాలు అందుబాటులో లేవని, కనీసం పట్టలు, ధాన్యం పట్టుబడికి అవసరమైన గోతాలు, రవాణా వసతి లేదని రైతులు వాపోతున్నారు. అయితే రైతులే వీటిని సమకూర్చుకుంటే ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందంటూ అధికారులు చెబుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

మిల్లర్ల దోపిడీ

ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 17 శాతం తేమతో ధాన్యాన్ని సీఎంఆర్ కింద మిల్లుల వద్దకు తీసుకెళ్తే ప్రతి బస్తాకు రెండు కేజీల తరుగు ఇవ్వాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ అన్‌లోడింగ్‌కు కాలయాపన చేస్తున్నారు. దీంతో రైతులు ఒక పక్క బస్తాల్లో ధాన్యం తడారిపోతుందని, రవాణా వాహనాలకు చార్జీలు పెరిగిపోతున్నాయని ఆందోళనతో మిల్లర్లు అడిగిన కాడికి ఇచ్చేసి చేతులు దులుపుకుంటున్నారు. కొందరు రైతులు అయితే ఈ వెతలు పడలేక నేరుగా మిల్లరు, దళారీ అడిగిన ధరకే కళ్లాల్లోనే అమ్ముకుని బయటపడుతున్నారు.

మిల్లర్లకు నజరానాలు, రైతులకు పంగనామాలు

ధాన్యం క్రయవిక్రయాల్లో అన్నదాతలు అడుగడుగునా దగాకు గురవుతున్నారు. ఒక పక్క మిల్లర్లు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర (పుట్టి రూ.19,600పైగా ఉంది)కు కొనుగోలు చేయడం లేదు. గతేడాది పుట్టి ధాన్యం రూ.24 వేలకు అమ్ముకుంటే.. ఇప్పుడు రూ.15 వేలకు కూడా కొననడం లేదని రైతులు వాపోతున్నారు. పైగా మిల్లర్లకే డ్రయ్యర్ చార్జీల కింద పుట్టికి రూ.500 ప్రభుత్వం అందజేస్తోంది. విత్తనం నాటడం నుంచి ధాన్యం అమ్ముకునే వరకు ఏ విపత్తు వచ్చినా, ప్రతి కష్టం, నష్టం రైతులు పడాల్సిందే. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ధాన్యంలో తేమ శాతం 17 ఉండే విధంగా రైతులు పొలాల్లోనే ఆరబెట్టుకుని, వారే గోతాలు సమకూర్చుకుని, రవాణా వసతి ఏర్పాటు చేసుకుంటూ అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వ పరంగా ఏ విధంగానూ సాయం అందిస్తున్న దాఖలాలు లేవు. మిల్లర్ల నుంచి రావాల్సిన బకాయిలు వసూలు చేసి రైతులకు అందజేసే విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కానీ రైతులను అడుగడుగునా దోచుకుంటున్న మిల్లర్లకు మాత్రం ఇతర చార్జీలు, రాయితీలను ఎప్పటికప్పుడు చెల్లిస్తోంది.

రైతుల పరిస్థితి దారుణం

సన్న, చిన్నకారు రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. నారు పోసినప్పటి నుంచి కోత కోసి ధాన్యం అమ్ముకునే వరకు ఎన్నో సమస్యలున్నాయి. కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లేందుకు ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నాం. దీంతో గతిలేక దళారులకే అమ్ముకొంటున్నాం.

– బుచ్చెంగారి తిరుపతి, విడవలూరు

ధాన్యం మిల్లులో అన్‌లోడ్ చేయడం లేదు

కొనుగోలు కేంద్రం ద్వారా రైతు మిల్లుకు ధాన్యం తోలిన వెంటనే మిల్లర్లు దించుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగానే 17 శాతం తేమతో ధాన్యాన్ని తీసుకెళ్తే మిల్లర్లు 40 కేజీ బస్తాకు రెండు కేజీల తరుగు ఇస్తామంటే వెంటనే దించుకుంటున్నారు. లేదంటే రెండు లేదా మూడు రోజులు అన్‌లోడ్ చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

– కలికి శ్రీధర్‌రెడ్డి, రైతు కోవూరు



సివిల్ సప్లయ్స్ ఎండీతో సమస్యను వివరిస్తున్న రైతులు (ఫైల్)

క్లుప్తంగా

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని జిల్లా అదనపు సివిల్ జడ్జి శ్రీనివాస్ దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు స్వామి, అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అతిథులకు అందజేశారు. ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

18న లక్ష్మీ నృసింహునికి చందనాలంకరణ

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తికి ఈ నెల 18న చందనాలంకరణ గావించనున్నట్లు దేవస్థాన ఆదివారం ఒక ప్రకటనలో అధికారులు తెలిపారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతినక్షత్రం కావడంతో ఆ రోజు ఉదయం 4 గంటలకు తిరుప్పావై 9 గంటలకు శాంతి హోమం, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడ సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాలుడిని ఓదారుస్తూ చోరీకి యత్నం

బుచ్చిరెడ్డిపాళెం : ఏడుస్తున్న బాలుడిని ఓదారుస్తున్నట్లు నటిస్తూ బంగారును చోరీ చేసేందుకు ఇద్దరు మహిళలు యత్నించిన ఘటన బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలో నివాసం ఉండే దేవసేన అనే మహిళ తన మూడేళ్ల మనుమడిని తీసుకుని ఆంధ్రా బ్యాంక్ వీధిలో కర్రీస్ పాయింట్ వద్దకు వెళ్లింది. అక్కడ బాలుడు ఏడుస్తుండగా ఇద్దరు మహిళలు సముదాయించే నెపంతో బాబును తీసుకుని చేతికి ఉన్న బంగారు గాజులను చోరీ చేశారు. దీంతో ఆ బాబు గట్టిగా ఏడవడంతో అమ్మమ్మ చేతికి తీసుకుని చూడగా అప్పటికే బంగారం మాయమవడాన్ని గుర్తించింది. దీంతో వారిని ప్రశ్నించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అందరినీ తనిఖీ చేసే క్రమంలో గాజులను కర్రీస్ పాయింట్ పక్కన ఉన్న చెత్త కుండీ వద్ద పడేసి ఉండడం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానితులను పోలీసులు విచారిస్తున్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా అధికారులకు చోటు

నెల్లూరు(క్రైమ్) : విజయవాడలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘ రాష్ట్ర నూతన కార్యవర్గంలో జిల్లాకు చెందిన ఇద్దరు ఎక్సైజ్ అధికారులకు చోటు దక్కింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎక్సైజ్ నెల్లూరు–1 ఎస్సై ఎస్.ప్రభాకర్‌రావు, జోన్–3 కార్యదర్శిగా ఇందుకూరుపేట ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు వారిని నెల్లూరు డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, డీపీఈఓ ఎ.శ్రీనివాసులునాయుడు అభినందించారు.

ధన్‌బాద్ రైలుకు స్టాపింగ్

నెల్లూరు(సెంట్రల్): ధన్‌బాద్–కోయంబత్తూరు ప్రత్యేక రైలుకు ఈ నెల 10, 11 తేదీల్లో నెల్లూరులో తాత్కాలిక స్టాపింగ్ ఇచ్చినట్లు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రెయిన్ నంబర్ 03679 ధన్‌బాద్–కోయంబత్తూరు 10న నెల్లూరుకు, 03680 కోయంబత్తూరు– ధన్‌బాద్ 11న నెల్లూరుకు చేరుకుంటాయన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నెల్లూరు స్టాపింగ్ కొనసాగించాలా లేదా అనేది త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.

విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనాలి



నెల్లూరు సిటీ : విద్యుత్ బస్సులను ప్రైవేటు యాజమాన్యం ద్వారా కాకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి ఇచ్చి సొంతంగా నిర్వహించుకునే అవకాశం కల్పించాలని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. నగరంలోని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఆర్టీసీలో విద్యుత్ ప్రైవేటు బస్సులను ప్రవేశపెట్టి అలిపిరి డిపోను ఖాళీ చేయించారని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృత్తం అవుతుందన్న ఆందోళనలో ఉద్యోగులు ఉన్నారన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి జి.నారాయణరావు, నెల్లూరు జోన్ ఈయూ అధ్యక్షుడు వాకా రమేష్, జోనల్ కార్యదర్శి దాసరి బాబూ శామ్యూల్, మహిళా నేత సుభాషిని, జిల్లా కార్యదర్శి ఓవీ ప్రసాద్, ఎస్వీ సుబ్బారావు, రీజనల్ నాయకులు బి.మాల్యాద్రి, రవికుమార్, వీఎస్ రావు, యు.రమేష్‌బాబు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌కు విమర్శించే హక్కు లేదు

- ఆరోపణలు చేయాలంటే ఆధారాలతో రండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కొడవలూరు : రౌడీషీటర్‌గా ఉన్న యల్లాయపాళెం ఎంపీటీసీ సభ్యుడు రాజేంద్రకు డీసీఎమ్మెస్‌లో నాలుగేళ్లు పారదర్శక పాలన అందించిన చలపతిరావును విమర్శించే నైతిక హక్కులేదని వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథి గృహ ప్రాంగణంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏదైనా ఆరోపణలు చేయాలంటే ఆధారాలతో రావాలని, అంతేతప్ప ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఆధారాలు చూపి కేసులు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పారదర్శక పాలన అందించడం వల్లే రెండు పర్యాయాలు చైర్మన్‌గా ఎంపికై అప్పులు ఊబిలో ఉన్న డీసీఎమ్మెస్‌ను గట్టెక్కించారని తెలిపారు. ఎమ్మెల్యే మెప్పు కోసం చలపతిరావుపై విమర్శలు చేయడం సబబు కాదన్నారు. ఎంపీపీ జ్యోతి, ఎంపీటీసీ సభ్యుడు నంబూరి ప్రసాద్, సర్పంచ్ బి.సుప్రియ, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి రమేష్, ఎంపీటీసీ కామేశ్వరి, సర్పంచ్ మోచర్ల రమేష్, పార్టీ నాయకులు తాటిపర్తి భాస్కర్, మాణిక్యరావు, బండి పెంచలయ్య, గాలి సునీల్, జడ్డా సాయి, జనార్దన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా టాలెంట్ డే



పొదలకూరు: పట్టణంలోని అమరావతి స్కూల్లో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు టాలెంట్ డే, గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌ను ఈడీఏసీ సంస్థ ఆధ్వర్యంలో వేడుకగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సురేష్ మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. అనంతరం ఆరో తరగతిలోకి వచ్చే విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈడీఏసీ ప్రతినిధులు వరలక్ష్మి, అభికాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీటర్సన్ కెనాల్లో పూడిక తీయాలి



కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కోవూరు : కోవూరులో అస్తవ్యస్తంగా ఉన్న పీటర్సన్ కెనాల్లో పూడిక తీయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గండవరపు శేషయ్య, మండల కమిటీతో కలిసి స్థానిక బజారు సెంటర్ చేపల మార్కెట్ వద్ద ఉన్న పీటర్సన్ కెనాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీటర్సన్ కెనాల్ అధ్వానంగా ఉండడం వల్ల కాలువ పొడవున ఉన్న నివాస ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలతో పాటు చిన్న పిల్లలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రత్యేక గ్రాంట్‌ను మంజూరు చేయించి కాలువను డ్రెయినేజీగా మార్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు గండవరపు బుజయ్య, మారుబోయిన సుబ్బారావు, షేక్.అఫ్రోజ్, తిరువీధి రమేష్, సర్దార్ అహ్మద్, సూకలపాటి మోహన్, ఊటుకూరు రమణయ్య, కాలేషా, ఈగ హరి, యస్దానిబాషా, వెలుగు విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వసూళ్ల సంస్కృతి ఆయనది కాదు



మాట్లాడుతున్న లారీ సప్లయర్స్

కొడవలూరు: లారీ సప్లయర్స్ వద్ద వసూళ్లకు పాల్పడే సంస్కృతి వైఎస్సార్‌సీపీ నేత వీరి చలపతిరావుకు లేదని లారీ సప్లయర్స్ స్పష్టం చేశారు. నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథి గృహంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లారీ సప్లయర్స్ వద్ద చలపతిరావు వసూళ్లకు పాల్పడ్డాడని టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. తాము ఏదైనా అవసరాల్లో ఆయన్ను ఆశ్రయిస్తే పైసా ఖర్చు లేకుండా పనిచేసి పెడుతారన్నారు. రాజకీయాల కోసం తమను వాడుకోవద్దని కోరారు. లారీ సప్లయర్స్ రాయపు వేణు, ఈవీవీ నారపరెడ్డి, ముదివర్తి రాధయ్య, కోసూరు రవి, ఎండీ.ఫజులుల్లా తదితరులున్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



పొదలకూరు: పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు అనిశెట్టి వెంకటేశ్వర్లు కుమారుడి వివాహ వేడుకలకు మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం హాజరయ్యారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన వేడుకలో వధూవరులను ఆశీర్వదించారు.

ప్రశ్నించినందుకు కక్ష సాధింపు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలో అధికార పార్టీ నాయకుల మధ్య తీవ్ర ఉత్కంఠ పరిస్థితి నెలకొంది. రూరల్ మండలానికి చెందిన నాయకుడు తప్పుడు ట్రాక్ రికార్డులతో ధాన్యాన్ని సరఫరా చేయడాన్ని అదే పార్టీకి చెందిన శ్రీనివాసులు మరో రైతు కె.శ్రీనివాసులురెడ్డి అధికారుల వద్ద ప్రస్తావించారు. దీంతో ఆగ్రహించిన సదరు అధికార పార్టీ నాయకుడు నన్నే ప్రశ్నిస్తారా అంటూ శనివారం రాత్రి శ్రీనివాసులుపై దౌర్జన్యం చేసి అతని బైక్‌ను సైతం తీసుకుని తరిమేశారు. మరుసటి రోజు ఉదయం నీ అంతు చూస్తానంటూ భయపెట్టడంతో అతను పార్టీకి చెందిన పలువురి వద్ద జరిగిన విషయం చెప్పి వాపోయాడు. ఈ క్రమంలో శ్రీనివాసులురెడ్డి 112కు ఫోన్ చేసి అధికార పార్టీకి చెందిన నాయకుడు తనపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, రక్షణ కల్పించాల్సిందిగా ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు ఆదివారం శ్రీనివాసులురెడ్డి ఇంటికి వెళ్లి ఆరా తీశారు. జరిగిన విషయం చెప్పడంతో పాటు ఫిర్యాదు సైతం చేశారు. అదే క్రమంలో శ్రీనివాసులు కూడా ఫిర్యాదు చేశారు.

భాగవత సప్తాహ ప్రవచనాలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో భాగవత సప్తాహ ప్రవచనలను ఆదివారం నిర్వహించారు. అహోబిల రామానుజ జీయర్‌స్వామి, దేవస్థాన చైర్మన్ పెండ్యాల రమణయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా తిరుపతయ్య



విడవలూరు : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని పలువురు నాయకులకు రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో నియమించారు. ఈ నేపథ్యంలో మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన బుచ్చింగారి తిరుపతయ్యను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ తనకు పార్టీలో సముచిత స్థానం కల్పించినందుకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

కోవూరు : నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని, జిల్లాలో ఐదు వేల సీసీ కెమెరాలను ప్రస్తుతం ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా కోవూరు పోలీస్‌స్టేషన్‌కు మూడు వాహనాలు, భారీ సంఖ్యలో సీసీకెమెనాలను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదివారం అందించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని, మాట్లాడారు. సామాజిక రక్షణ బాధ్యత నిర్వహించే పోలీసులకు అత్యధిక సాంకేతిక మద్దతు లభిస్తే వారు మరింత సమర్థవంతంగా సేవలందిస్తారన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరును డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా మార్చడంలో ఎస్పీ కృష్ణకాంత్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కోవూరు పోలీస్‌స్టేషన్‌కు నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తామని వెల్లడించారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజా చైతన్య యాత్రలో సీపీఎం నేతలు

ముత్తుకూరు: గిరిజన కుటుంబాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్, ఆధార్ కార్డులు, పింఛన్లను అందజేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం అంకయ్య డిమాండ్ చేశారు. మండలంలోని పంటపాళెం కోడెలమిట్టలో చైతన్య యాత్రలను ఆదివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్థానిక ప్రాజెక్టుల్లో యువతకు ఉద్యోగావకాశాలను కల్పించాలని కోరారు. రోడ్డు నిర్మాణంతో గిరిజనుల ఇళ్లల్లోకి దుమ్ము చేరుతోందని, పక్కాగృహాలు పగుళ్లిస్తున్నాయని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాధయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ చైర్ల అందజేత



పొదలకూరు: పట్టణంలోని బాలుర, బాలికల, బీసీ బాలికల హాస్టళ్లలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ చైర్లు, పరీక్ష సామగ్రిని గూడూరుకు చెందిన సత్యసాయి సేవా సమితి యువజన విభాగ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. సమితి యూత్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ భవాని, కన్వీనర్ దాము ప్రతాప్, ప్రభుత్వ టీచర్ జ్యోతి, విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బారావు పాల్గొన్నారు.

రేపట్నుంచి పాండురంగడి బ్రహ్మోత్సవాలు



పాండురంగస్వామి దేవస్థానం

పొదలకూరు: మండలంలోని తాటిపర్తిలో రుక్మిణీ సమేత పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలను మంగళవారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నామని నిర్వాహక కమిటీ తెలిపింది. 11న అంకురార్పణ, 12న గరుడసేవ, గ్రామోత్సవం, 13న స్వామి వారి కల్యాణం, గిన్నెభిక్ష, 14న అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం, 15న వసంతోత్సవం, ఏకాంతసేవను నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు తరలి రావాలని కోరారు.